## క్లుప్తంగా

### ఘనంగా లక్షబిల్వార్చన



లక్షబిల్వార్చన పూజల్లో పాల్గొన్న భక్తులు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామంలోని శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి సమేత త్రిముఖలింగేశ్వర స్వామి ఆలయం వద్ద మంగళవారం లక్షాబిల్వార్చన కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. స్వామి జన్మనక్షత్రం పురస్కరించుకుని నిర్వహించిన పూజల్లో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గణపతి పూజ, రుద్రాభిషేకం, కుంకుమార్చన, హోమాలు నిర్వహించారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారధన నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ పడాల వెంకటరామారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు రమణశర్మ సమక్షంలో పూజలు జరిగాయి.

### రేపు గాయత్రీ హోమం

రాజానగరం: కార్తిక మాసం సందర్భంగా స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద గురువారం గాయత్రీ హోమం, కార్తిక అన్నసమారాధన జరగనున్నాయి. అమలాపురానికి చెందిన రామానంద స్వామిజీ శిష్యపరివారం ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ఆ రోజు ఉదయం 9 గంటలకు గాయత్రీ హోమం ప్రారంభమవుతుంది. అలాగే ఆలయం పక్కనే ఉన్న మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో 11 గంటల నుంచి అన్న సమారాధన నిర్వహిస్తారు. దీనిలో భాగంగా ఆలయాన్ని ఇప్పటికే విద్యుద్దీపాలు, కాషాయి జెండాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

### మహిళలు స్వయం సమృద్ధి సాధించాలి



కొంకుదురులో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులు

బిక్కవోలు: మహిళలు అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించాలని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం కొంకుదురు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా దిశ చట్టం, మహిళల రక్షణ, స్వయం సమృద్ధి తదితర అంశాలపై చర్చాగోష్టి నిర్వహించారు. తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ 107వ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్ బాల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఇందిరా గాంధీకి నివాళి

రాజానగరం: మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతిని సూర్యారావుపేటలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ డాక్టర్ వైఏ వడయార్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ వై.శ్రీనివాస్, మండల కమిటీ అధ్యక్షుడు ముప్పిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### అంతర్జాతీయ పురుషుల దినోత్సవం



బెలూన్ గేమ్‌లో పాల్గొన్న అధ్యాపకులు

రాజానగరం: స్థానిక గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో మహిళా అధ్యాపకుల ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ పురుషుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పురుష అధ్యాపకులకు బెలూన్ గేమ్స్, పజిల్స్, ఫన్నీ గేమ్స్, క్రికెట్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### పంట బీమాతో ఆర్థిక రక్షణ



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి ఖాసిమ్

రాజానగరం: ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణను పొందేందుకు ప్రతి రైతు పంట నమోదు, పంట బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి షేక్ ఇమామి ఖాసిమ్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని జి.యర్రంపాలెం, సంపత్ నగరం గ్రామాలలో మంగళవారం రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దాళ్వా వరి నారుమడులు వసే సమయంలో తప్పనిసరిగా విత్తన శుద్ధి చేయించుకోవాలన్నారు. కార్బెండిజిమ్‌తో ఈ విధంగా చేయడం వలన తెగుళ్ల బెడద లేకుండా నాణ్యమైన నారును పొందవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ సహాయకులు సురేఖ, ప్రత్యూష, రైతులు పాల్గొన్నారు.

# సంరక్షణతో వ్యాధులు దూరం

- శీతాకాలంలో పశుపోషణపై దృష్టి సారిస్తే మేలు
- ముందస్తు జాగ్రత్తలు పాటించటం శ్రేయస్కరం
- వైద్యుల సలహాలు, సూచనలు మూగజీవాలకు ఉపయుక్తం



పెదపూడిలో గేదెకు చికిత్స చేస్తున్న పశువైద్యాధికారి సాయికృష్ణ

పెదపూడి: చలికాలంలో పశువులకు పలు రకాల వ్యాధులు సంక్రమించే అవకాశం ఉండటంతో పశు సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కొత్తగడ్డిని మేసే పశువులు, గొర్రెలు, మేకలు బలహీనంగా తయారవుతాయి. సకాలంలో తగిన వైద్యం అందిస్తే పశువులను కాపాడుకోవచ్చని పశువైద్యాధికారులు చెబుతున్నారు. సీజనల్ వ్యాధుల నుంచి పశు సంరక్షణకు సంబంధించి పాడి రైతులకు పలు సూచనలు చేస్తున్నారు.

**గురక లేక గొంతువాపు**

పశువుల్లో గురక లేక గొంతువాపు వ్యాధి బ్యాక్టీరియా సూక్ష్మజీవి కారణంగా వస్తుంది. గడ్డం కింద వాపు, కళ్లు ఎర్రపడటం, ముక్కు నుంచి జీర కారడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడతాయి. గొంతువాపు వ్యాధి నివారణకు సల్ఫాడిమిడిన్, ఇంటాసెఫ్టాజ్ అనే మందులు వాడటంతో ఫలితం ఉంటుంది. ముందస్తు టీకాలు వేయించడంతో అరికట్టవచ్చు.

**గాలి కుంటువ్యాధి లక్షణాలు**

పికార్నో వైరస్‌తో పశువుల్లో గాలికుంటు వ్యాధి సంక్రమిస్తుంది. గిట్టలు ఉన్న పశువులకు ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుంది. నోరు, కాళ్లలో పుండ్లు ఏర్పడి పశువులు నడవలేకపోతాయి. ప్రత్యేకించి గాలికుంటు టీకాలు ఆరు నెలలకు ఓసారి వేయాలి. వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి. గిట్టల మధ్యలోని పుండ్లకు పర్మాంగనేట్ ద్రావణంతో శుభ్రం చేయాలి. బీస్ట్రెపెన్ అనే మందు 2.5 గ్రాములు, ఎన్రోఫ్లాక్సిన్ 50 ఎంఎల్ మందు వాడటంతో పాటు వేపనూనె రాయడంతో ఫలితం ఉంటుంది.

**తిరుగుడు రోగం**

రక్తంలోని ట్రిపనోజోమా పరాన్న జీవులు కారణంగా పశువుల్లో తిరుగుడు రోగం సంక్రమిస్తుంది. ఇది అన్ని రకాల పశువులకు వచ్చే అవకాశం ఉంది. బేరేనిల్, త్రిక్విన్, పెరిటాస్ మందులు వాడటంతో ఫలితం ఉంటుంది.

**జబ్బువాపు వ్యాధి**

పశువుల్లో చలికాలంలో వచ్చే మరోవ్యాధి జబ్బువాపు. దీనిని సొప్ప వ్యాధి అని, బ్లాక్ క్వార్టర్ అని పిలుస్తారు. వ్యాధి ముఖ్యంగా తెల్లజాతి పశువులలో అనగా ఆవులలో ఆరు నెలల నుంచి రెండు సంవత్సరాల లోపు వయస్సులో బలంగా, ఆరోగ్యంగా ఉన్న పశువులలో ఎక్కువగా వస్తుంది. ఈ వ్యాధి కారక సూక్ష్మజీవి క్లోస్ట్రిడియం షావై బీజాంశాలు మట్టి నుంచి పశువు శరీరంలోకి చేరినప్పుడు ఈ వ్యాధి కలుగుతుంది. దీని నివారణకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసే టీకాలు వేయించుకోవచ్చు.

**సాధారణ చిట్కాలు**

కాలానికి తగిన విధంగా ఆహారాన్ని, నీటిని అందిస్తూ పరిశుభ్ర వాతావరణంలో పశువులను ఉంచాలి. శీతాకాలం ప్రారంభం నుంచే అధికచలి నుంచి రక్షణ ఏర్పాట్లు చేయాలి. శీతాకాలంలో పశువులకు దాణాను కాస్త ఆలస్యంగా ఇవ్వాలి. నట్టల నివారణ మందులు ముందస్తుగా తాగించాలి. ఎఫ్ఎండీ, హెచ్ఎస్, బీక్యూ టీకాలు తప్పనిసరిగా వేయించాలి. పశువుల పాకలను సూర్యరశ్మి పడేవిధంగా ఏర్పాటు చేసుకోవాలి.

అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట, రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాల పరిధిలో గేదెలు సుమారుగా 80,657, ఆవులు 32,420 వరకు ఉన్నాయి. గొర్రెలు 14,023, మేకలు 15,070 ఉన్నాయి.

### ముందస్తు జాగ్రత్తలతో సంరక్షణ



పశువుల పెంపకంలో ముందస్తు చర్యలు చేపట్టడంతోనే సంరక్షణ సాధ్యమవుతుంది. వేసవికాలం నుంచే పశువులకు టీకాలు వేయించాలి. డాక్టర్ల సలహాల మేరకే మందులు వాడాలి. పాడి రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పెదపూడి మండలంలో ఆవులు 2,160, గేదెలు 10,445, గొర్రెలు 19, మేకలు 542 ఉన్నాయి.

సాయి కృష్ణ, మండల పశువైద్యాధికారి, పెదపూడి మండలం.

### అవాస్ యాప్‌పై అవగాహన

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అవాస్ ప్లస్ యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్ ఏఈ నాగచక్రం మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి తాటాకిళ్లు, ఖాళీ స్థలాలు ఉన్న వారితో మాట్లాడాలని సిబ్బందికి సూచించారు. వారికి ఇల్లు నిర్మించుకునే ఉద్దేశం ఉంటే ఆ వివరాలను యాప్‌లో పొందుపర్చాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### గోలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు



బిక్కవోలులో ప్రత్యేక అలంకరణలో గోలింగేశ్వరస్వామి

బిక్కవోలు: కార్తిక మాసం మంగళవారం సంకటహర చతుర్థి సందర్భంగా గొలింగేశ్వరస్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామివారి జన్మనక్షత్రం ఆర్రుద నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అన్నసమారధన నిర్వహించారు. ఆలయ ఈవో భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

### ఉమా రామలింగేశ్వరుడికి లక్ష బిల్వార్చన



హోమంలో పాల్గొన్న భక్తులు

రంగంపేట: రంగంపేట గ్రామంలో కొలువైన ఉమా రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో 14వ వార్షిక లక్ష బిల్వార్చన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకాలు, బిల్వార్చన, రుద్రహోమం, కుంకుమార్చన, నీరాజన మంత్రపుష్పాలు, వేదస్వస్తి తదితర కార్యక్రమాలను ఆలయ అర్చకులు మైలవరపు నాగేంద్ర కుమార్ ఆధ్వర్యంలో రుత్వికులు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## మహిళా సాధికారతపై అవగాహన



సీతానగరం గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

సీతానగరం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సీతానగరం గ్రంథాలయంలో దిశ చట్టం, మహిళా సాధికారతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. లైబ్రేరియన్ టి.అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పుస్తక నిక్షిప్త కేంద్రం నిర్వాహకురాలు బి.అరుణ మాట్లాడుతూ శతాబ్దాలుగా దేశంలో మహిళల పాత్ర అనేక గొప్ప మార్పులకు లోనవుతూ వచ్చిందన్నారు. ఆధునిక భారతదేశంలో మహిళలు రాష్ట్రపతి, ప్రధానమంత్రి, లోక్‌సభ, ప్రతిపక్ష నాయకురాలు వంటి అత్యున్నత పదవులను అలంకరించారన్నారు. అలాగే దిశ చట్టంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. కార్యక్రమంలో మహిళా శక్తి సంఘం మహిళలు ఎం.శిరీష, ఎం.గనిరత్నం, ఎస్.ముత్యాలు, ఎం.చంటమ్మ పాల్గొన్నారు.

**విద్యార్థులకు పోటీలు**

రాజానగరం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం దివంగత ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ సత్యనారాయణ, సీహెచ్ పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న ప్రసాదరావు

పెదపూడి: మండలంలోని గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ప్రసాదరావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం హౌసింగ్ నిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. అంతకుముందు రామేశ్వరం, పెదపూడి లే అవుట్లో జరుగుతున్న గృహ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. వచ్చే ఏడాది మార్చి 31లోపు నిర్మాణ దశలో ఉన్న గృహాల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. అనంతరం ప్రపంచ టాయిలెట్స్ డే సందర్భంగా పలువురు పారిశుధ్య కార్మికులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి, ఈఓపీఆర్డీ మేడపాటి సత్యనారాయణ రెడ్డి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గంగాధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## కోడి పందేల నిర్వాహకులపై చర్యలు



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ సత్య కిషోర్

మధురపూడి: సంక్రాంతి సందర్భంగా కోడి పందేల నిర్వహణకు అనుమతులు లేవని, నిబంధనలు ఉల్లంఘించి నిర్వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని కోరుకొండ సీఐ వై.సత్య కిషోర్ అన్నారు. కోరుకొండలోని సీఐ కార్యాలయంలో కోరుకొండ, సీతానగరం, గోకవరం ఎస్సైలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు నిర్వహించినా, కత్తులు తయారు చేసినా, పందేలకు స్థలాలను సిద్ధం చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. పేకాట, గుండాట, సారా తయారీ దారులపై ఉక్కుపాదం మోపామన్నారు. గంజాయి రవాణా, మహిళలపై దాడులు, అత్యాచారాలను అరికట్టడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. మహిళలు, ప్రముఖులను కించపరుస్తూ సామాజిక మాధ్యమాలలో పోస్టులు పెట్టిన వారిపై చర్యలుంటాయన్నారు. సమావేశంలో ఎస్సైలు శ్యామ్ సుందర్, పవన్ కుమార్, రామ్ కుమార్ పాల్గొన్నారు.

## వ్యక్తిగత మరుగుదొడ్లతో పరిశుభ్రత




కోరుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు




అనపర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

మధురపూడి: వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం ద్వారా గ్రామాల్లో పరిశుభ్రత నెలకొంటుందని కోరుకొండ ఎంపీడీఓ బత్తిన అశోక్ కుమార్ అన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కోరుకొండలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన గ్రామాల సాధన కోసం సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ విస్తరణ అధికారి బి.మహేశ్వర ప్రతాప్, కోరుకొండ పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**అనపర్తిలో టాయిలెట్ డే ర్యాలీ**

పెదపూడి: వరల్డ్ టాయిలెట్ డే కార్యక్రమాలను అధికారులు విజయవంతం చేయాలని అనపర్తి ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి కోరారు. అనపర్తి గ్రామ పంచాయతీ వద్ద వరల్డ్ టాయిలెట్ డే సందర్భంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మరుగుదొడ్ల ఉపయోగంపై ప్రజలకు వివరించే కార్యక్రమాలు డిసెంబర్ 10వరకు నిర్వహించాలన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు సన్మానాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు



గ్రామసభలో దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ సీతాపతిరావు

పెదపూడి: భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చామని తహసీల్దార్ పీవీ సీతాపతిరావు అన్నారు. పెదపూడి గ్రామంలో సర్పంచి అద్దంకి మాచరమ్మ అధ్యక్షతన మంగళవారం రీసర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 22న ప్రారంభించిన రీసర్వే గ్రామసభలు నేటితో ముగిసాయన్నారు. భూ కొలతల్లో తేడాలు, సర్వే నంబర్లలో మార్పులు, వారసత్వం పేర్లు నమోదు, సరిహద్దు సమస్య, భూ విస్తీర్ణంలో తేడాలు మొదలగు సమస్యలపై గ్రామసభల్లో రైతులు అర్జీలు అందించారన్నారు. ఈ గ్రామసభలో 390 దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, జనసేన పార్టీ మండల కన్వీనర్ నాగిరెడ్డి వీరస్వామి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు తిబిరిశెట్టి ఆదినారాయణ, వీఆర్వో గొల్లపల్లి అంజిబాబు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలకు అపార నష్టం

కంబాలచెరువు: ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ అసంబద్ధంగా ఉందని, దాన్ని వెంటనే సరిచేయకపోతే ప్రభుత్వ పాఠశాలలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్ అన్నారు. గతంలో ఒక పాఠశాలకు అక్కడ ఒక ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడున్నా.. అవసరాన్ని బట్టి వేరే పాఠశాల నుంచి మరో ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేశారన్నారు. ఇప్పుడు ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో ఒక ఉపాధ్యాయుడిని వేరే స్కూల్‌కు పంపించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇలాంటి సందర్భంలో కొత్త ఉపాధ్యాయుడిని కాకుండా పాత ఉపాధ్యాయుడిని పంపిస్తున్నారని ఆరోపించారు. అలాగే స్కూల్ అసిస్టెంట్ సబ్జెక్టు టీచర్ లేకపోతే వేరొక పాఠశాల నుంచి అర్హతలు ఉన్న ఎస్‌జీటీ టీచర్‌ను సర్దుబాటు చేస్తున్నారన్నారు. విద్యాశాఖ అధికారులు వెంటనే ఇలాంటి విషయాలపై దృష్టి సారించాలని కోరారు.

### యూటీఎఫ్ స్వర్ణోత్సవాల విజయవంతానికి కృషి

కంబాలచెరువు: యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయడానికి ఉపాధ్యాయులందరూ సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర కార్యదర్శి ఎస్.అరుణ కుమారి పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరంలోని యూటీఎఫ్ హోమ్‌లో మంగళవారం జిల్లా యూటీఎఫ్ స్వర్ణోత్సవ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం పాఠశాల పని వేళలు ఒక గంట పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. నియమిత పని గంటలు మించి విద్యార్థులకు బోధన సాగిస్తే పిల్లలు ఒత్తిడికి గురయ్యే ప్రమాదముందన్నారు. అధికారులు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ కాకినాడలో జరగనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అసోసియేట్ విజయ్ గౌరీ, జిల్లా కార్యదర్శులు శ్రీమణి, రమేష్, ప్రకాష్, ఎం.భాస్కర్, దయానిధి, నర్సారెడ్డి నాగభూషణం పాల్గొన్నారు.

## విద్యా చైతన్యం ప్రగతికి మూలం



వక్తృత్వ పోటీల్లో పాల్గొన్న పాఠశాలల విద్యార్థులు

రంగంపేట: విద్యా చైతన్యం సమాజ ప్రగతికి మూలమని విశ్రాంత కళాశాల అధ్యాపకులు పీవీ మాధవి అన్నారు. మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎస్. రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విశ్రాంత అధ్యాపకురాలు మాధవి, క్రాఫ్ట్ ఉపాధ్యాయురాలు బి.లక్ష్మి పాల్గొన్నారు. దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, సరోజినీదేవి, రాణి రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయి తదితర వీర వనితల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మహిళలు ఉన్నత విద్యాభ్యాసం సమాజ ప్రగతికి బాటలు వేస్తుందన్నారు. వీరనారీమణుల జీవిత విశేషాలు విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయాధికారి రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ అంశాలపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

## జనవరి 5న హైందవ శంఖారావం

రాజానగరం: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావం భారీ బహిరంగ సభకు హిందువులందరూ తరలిరావాలని మండల కన్వీనర్ గ్రంధి గణేష్, కో కన్వీనర్ జి. శ్రీనివాస్‌లు విజ్ఞప్తి చేశారు. రిమ్మలపూడి సుబ్బరాజు అధ్యక్షతన దివాన్ చెరువులోని ధరణి గోదావరి విద్యా పీఠంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. దేవాలయాల పరిరక్షణ కోసం ప్రతి హిందువు ముందడుగు వేయాలన్నారు. అనంతరం హైందవ శంఖారావం పోస్టర్‌ను తిక్కన వీర వెంకట్రావు ఆవిష్కరించారు.

## క్రమశిక్షణతో విద్యాబోధన చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత ప్రిన్సిపాల్ బూరయ్య

కంబాలచెరువు: క్రమశిక్షణ కలిగిన భావి భారత పౌరులను తయారు చేయాలని ఉపాధ్యాయులకు బీఈడీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డి.బూరయ్య సూచించారు. స్థానిక కంటిపూడి రామారావు మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశానికి మంగళవారం ఆయన ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులపై అనేక ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, సమర్థవంతంగా పనిచేయాలన్నారు. బోధనలో ఆధునిక టెక్నాలజీపై అవగాహన చేసుకోవాలన్నారు. అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ప్రతి నెలా నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఉపాధ్యాయులు వినియోగించుకోవాలన్నారు. ప్రతి పాఠశాలలో చేస్తున్న వినూత్న కార్యక్రమాలను, విద్యా ప్రవేశ్ కృత్యాలను సమీక్షించారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ఒకటో తరగతి విద్యార్థులకు నిర్వహించిన విద్యాప్రవేశ్ కృత్యాలను భద్రపరచాలన్నారు. కాంప్లెక్స్ చైర్మన్ పులుగుర్త దుర్గాప్రసాద్, రిసోర్స్ పెర్సన్ మోటూరి మంగారాణి, సీఆర్‌పీ పబ్బినీడి ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కార్యదర్శి అరుణ్

ధవళేశ్వరం: నివాస గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును వెంటనే ఆపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, నగర కమిటీ సభ్యుడు కర్రి రామకృష్ణ డిమాండ్ చేశారు. ధవళేశ్వరం సీఐటీయూ కార్యాలయంలో కె.రంగారావు అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముందుగా పలు జిల్లాలలో ప్రభుత్వ కార్యాలయాలకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించారన్నారు. ప్రస్తుతం చిన్న, మధ్య తరగతి వ్యాపార సంస్థలతో సహా అందరికీ స్మార్ట్ మీటర్లు పెడుతున్నారన్నారు. ఇప్పుడు విద్యుత్ వినియోగదారుల అనుమతి లేకుండా నివాస గృహాలకు మీటర్లు బిగించడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో ఎక్కడ స్మార్ట్ మీటర్లు బిగించినా ప్రజలందరూ ప్రతిఘటించాలని సూచించారు. గత ప్రభుత్వం పంపుసెట్లకు మీటర్లు బిగించడాన్ని ప్రతిపక్షంలో ఉండగా తెలుగుదేశం, జనసేన పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయని గుర్తు చేశారు. నాడు మీటర్లు పగలగొట్టాలని పిలుపునిచ్చినవారే నేడు మీటర్లు బిగిస్తుండడం ప్రజలను మోసం చేయడమే అవుతుందని ధ్వజమెత్తారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలందరిపై భారం పెరుగుతుందని, ముందుగానే డబ్బు చెల్లించి రీచార్జి చేయించుకోవాలన్నారు. మరో వైపు ప్రతి మీటర్‌కు అయ్యే ఖర్చును 96 నెలల పాటు వాయిదాల పద్ధతిలో వినియోగదారుల నుంచే వసూలు చేస్తారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగి తెలుగుదేశం, జనసేన పార్టీలు ఈ మీటర్లను కొనసాగించడం దుర్మార్గమన్నారు. సమావేశంలో ఎస్.దుర్గాప్రసాద్, సీహెచ్ రామకృష్ణ, ఆర్.రామకృష్ణ, డి.నారాయణ పాల్గొన్నారు.